క్లుప్తంగా

జెడ్.భావారంలో రీ సర్వే గ్రామ సభ



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: మండలంలోని జెడ్.భావారంలో మంగళవారం రెవెన్యూ అధికారులు రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా, పట్టాదార్ పాసు పుస్తకాల్లో మ్యుటేషన్ చేయించుకోవాలన్నా, రికార్డుల ప్రకారం భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలున్నా గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వీటిపై సర్వే చేయించి, పరిష్కరిస్తారన్నారు. మొత్తం 49 మంది రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ పవన్, దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, రీ సర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, వీఆర్వో పీవీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న సుధాకర్

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ కనబర్చాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన 1, 13, 14 సర్కిళ్లలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల తనిఖీ నిర్వహించారు. చెత్త సేకరణ ఏ విధంగా చేపడుతున్నదీ ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేయాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు, వర్మ, ప్రసాద్, నాయుడు తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అనుసూరి



ప్రభాకరరావుకు ఉత్తర్వులు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

కాకినాడ సిటీ: బీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అనుసూరి ప్రభాకరరావును నియమిస్తూ సంఘ జాతీయ నాయకుడు గూడూరు వెంకటేశ్వరరావు ఉత్తర్వులు అందజేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభాకరరావుకు నియామక ఉత్తర్వులు అందించారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..!?

- సాగుతున్న జేఎన్‌టీయూకే స్నాతకోత్సవ భవన నిర్మాణ పనులు
- మందకొడిగా సీసీ రోడ్ల నిర్మాణం
- పెరుగుతున్న వృథా ఖర్చులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు



నిర్మాణ దశలో ఉన్న స్నాతకోత్సవ భవనం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. దాదాపు రూ.40 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ నిర్మితమై దశాబ్ద కాలం దాటింది. అయితే దాని నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకూ పూర్తి స్థాయిలో భవనం ఏర్పాటు కాలేదు. మూడేళ్ల కాల పరిమితితో నలుగురు వీసీలు పనిచేసిన వర్సిటీకి ప్రధానంగా ఉండాల్సిన స్నాతకోత్సవ భవనానికి శంకుస్థాపనలు చేసారు మినహా.. దాని నిర్మాణానికి శ్రద్ధ వహించలేదు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ నిర్మాణంలో జాప్యం వహించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలలకు వేదికగా ఉన్న వర్సిటీకి ఇప్పటివరకూ పది స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. కులపతి హోదాలో రెండు సార్లు రాష్ట్ర గవర్నర్లు హాజరయ్యారు. వేడుకలు నిర్వహించేటప్పుడు తాత్కాలికంగా వేదిక ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేవలం స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించేటప్పుడు మాత్రమే ఏర్పాటు చేసే వేదికకు దాదాపు రూ.15 లక్షలకు పైబడి ఖర్చు పెడుతున్నారు. షామియానాలు, ఏసీలు, వేదిక ఏర్పాటు తదితర వాటికి నిధులు వెచ్చిస్తున్నారు. భవనం పూర్తయితే ఇటువంటి వృథా ఖర్చులు నిలిచిపోతాయి. వర్సిటీకి సింబాలిక్‌గా నిలిచే స్నాతకోత్సవ భవనం దాదాపు 1,500 మంది ఆశీనులయ్యేలా పరీక్షల విభాగం బిల్డింగ్ పక్కన నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తొలి విడతలో రూ.19.3 కోట్లతో నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఆయన పదవీకాలం గత అక్టోబర్ వరకున్నా, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే, వారి సూచనలతో రాజీనామా చేయాల్సి వచ్చింది. తరువాత ఇన్‌చార్జి వీసీని నియమించి ప్రస్తుత కార్యకలాపాలు నిర్వహించడంతో, ఇటువంటి మౌలిక వసతులపై సరిగా దృష్టి సారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

వేగంగా జరిగేలా చర్యలు



స్నాతకోత్సవ భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. అలాగే రోడ్ల నిర్మాణ పనులు కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి, పనులు వేగవంతం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం.

– డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ, జేఎన్‌టీయూకే

సీసీ రోడ్లది అదే పరిస్థితి

వర్సిటీ ప్రాంగణంలో దాదాపు రూ.20 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్లది అదే పరిస్థితి కనబడుతోంది. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా, ఎక్కడా పూర్తి స్థాయిలో ఓ కొలిక్కి రాలేదు. తొలుత వేగంగా జరిగిన పనులు, గత ఐదు నెలలుగా చాలా మందకొడిగా సాగుతున్నాయి. పనుల నిర్వహణకు కాలం అనుకూలంగా ఉన్నా, పనులను తాత్సారం చేయడంలో ఆంతర్యమేమిటోనని పలువురు చర్చించుకుంటున్నారు.

మోకాళ్ల నొప్పులపై అశ్రద్ధ వద్దు



అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ

కాకినాడ రూరల్: ఎక్కువ కాలం మోకాళ్ల నొప్పులు ఉంటే అశ్రద్ధ తగదని, అలా చేస్తే అంతటితో ఆగకుండా తుంటి, నడుం నొప్పులు మొదలవుతాయని ఫిజియోథెరపీ వైద్యుడు కె.వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ, కండరాల పటుత్వం తగ్గడం, ఎముకలు గుల్లబారడం, మధుమేహం, ఊబకాయం, అధిక బరువు, థైరాయిడ్ వంటి సమస్యల వలన మోకాళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. నడక, శారీరక వ్యాయమం ద్వారా అధిక బరువును నియంత్రించవచ్చన్నారు. తేలికైన ఆహారంతో పాటు, తగిన విశ్రాంతి తీసుకోవడం వలన కీళ్ల నొప్పుల బాధ నుంచి బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్య పరిష్కరించాలి

- మంత్రికి సీపీఎం నేతల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలంలోని విలీన గ్రామాల సమస్యపై ఒక ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ప్రతినిధులు చింతపల్లి అజయ్‌కుమార్, తటవర్తి సుబ్బారావు, జయప్రకాష్ నారాయణ అసోసియేషన్ ప్రతినిధులు జోగా అప్పారావు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణను కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం కాకినాడకు వచ్చిన మంత్రి నారాయణను కలిసి, విలీన గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రతినిధి సీహెచ్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, గత 14 ఏళ్లుగా ఎన్నికలు, పాలకవర్గాలు లేని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, ఎస్ అచ్యుతాపురం, టీచర్స్ కాలనీలను కాకినాడ కార్పొరేషన్‌లో వెంటనే విలీనం చేసి, నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశామన్నారు. ఆయా గ్రామాలకు నిధులు రాక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. గత 26 నెలలుగా ఎన్నికలు జరపలేదన్నారు. గతంలో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే విలీనం చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ ఇచ్చిన విజయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ విషయంపై గత నెలలో ప్రిన్సిపల్ సెక్రటరీకి కలెక్టర్ నివేదిక ఇచ్చి నెల రోజులైనా ప్రభుత్వం నుంచి ఏ ప్రకటనా రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. ఎన్నికలు జరిగితేనే ఆర్థిక సంఘ నిధులు వచ్చే అవకాశం ఉన్నందున, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని కోరినట్టు వారు తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కరప: చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న తమ సమస్యలు పరిష్కరించాలని 104 వాహన ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ నాయక్‌ను 104 వాహనం డ్రైవర్ ఎం.త్రిమూర్తులు, డీఈఓ వి.ఇందుమతి కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు మాట్లాడుతూ, గత 16 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఇతర అవుట్‌సోర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగులకంటే చాలా తక్కువ వేతనాలకు పనిచేస్తూ, అన్యాయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రెండు వారాల్లో తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గతంలో లాగే పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలని, మూడు నెలల బకాయిలను అరబిందో యాజమాన్యం వెంటనే చెల్లించాలని, 2020 తర్వాత ఉద్యోగంలో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 104 వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లు చేయించాలని కోరారు.

మహిమాన్వితులు సత్యప్రమోద తీర్థులు



సత్యప్రమోద తీర్థ బృందావనానికి పూజలు చేస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో సత్యప్రమోదతీర్థ ఆరాధన మహోత్సవాలు మంగళవారం స్థానిక చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించారు. సత్యప్రమోద తీర్థ మృత్తికా బృందావనానికి మధ్వసభ యువజన కమిటీ విభాగ అధ్యక్షులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్వేష్ మాట్లాడుతూ, ఎందరికో మధ్వమత విషయాలను పరిచయం చేయడమే కాకుండా, రానున్న తరం వేద విద్యను ముందుకు తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో బెంగళూరులో జయతీర్థ విద్యాపీఠాన్ని స్థాపించిన గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని కొనియాడారు. మధ్వాచారుల గ్రంథ సంపదను పరిరక్షించడానికి నిరంతరం కృషి చేసిన మహనీయులన్నారు. వారి మృతికా బృందావనం ఈ ప్రాంతంలో ఉండడం అదృష్టమన్నారు. బ్రాహ్మణులకు మైలవరపు రమణ దంపతులు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హనుమంతాచార్, యాతగిరి పరశురామ్, తాడూరి రంగారావు, రాచూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బకాయిలు విడుదల చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 6న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకటించారు. సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కచేరిపేటలో ఈ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ఎం గంగా సూరిబాబు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వసతి దీవెన, విద్యాదీవెన బకాయిలు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని విడుదల చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు కనీసం మాట్లాడడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కళాశాలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పడకపోవడంతో తమ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, లేకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోబోమని విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు శ్రీకాంత్, మణికంఠ, వాసుదేవ్, సాహిత్, సంజయ్, చిన్ని, విపిన్‌కుమార్, జయరాం, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్దనున్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో గురువారం జరగనున్న జాతీయ వర్క్‌షాప్ కరపత్రాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ కమలకుమారి ఆవిష్కరించారు. పీజీ సెంటర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో హెచ్ఆర్ స్ట్రాటజీస్ ఫర్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై ఈ వర్క్‌షాప్‌ను ఉదయం పది గంటల నుంచి సెమినార్ హాలులో నిర్వహించనున్నారు. వర్క్‌షాప్‌లో ఓఎన్‌జీసీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) సునీల్‌కుమార్, చీఫ్ మేనేజర్(ఎస్టాబ్లిష్‌మెంట్) డాక్టర్ ఎన్.మనీ, సినర్జీ బిజినెస్ స్కూల్(హైదరాబాద్) హెచ్ఆర్ ప్రొఫెసర్ రమేష్, ట్రైనర్ డాక్టర్ ఏపీజే విను పాల్గొంటారని ప్రోగ్రాం కన్వీనర్ అజయ్ రతన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ ఎం.శ్రీరామరాజు, డాక్టర్ ఎల్.మధుకుమార్, కె.మణికంఠేశ్వర్ రెడ్డి, వై.మనోజ్ దేవ, డాక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మితో వ్యాధులు




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడ్డాల సత్యనారాయణ తదితరులు

బోట్‌క్లబ్: అందరూ తిరిగే ప్రదేశాల్లో బహిరంగంగా ఉమ్మి వేయడం వల్ల పలు రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. కరోనా సమయంలో ఇలా చేయడం వలన కరోనా తీవ్రమైన విషయాన్ని గుర్తుచేశారు. స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాలలో మంగళవారం బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మటం వలన కలిగే ఆరోగ్య ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్తిక మాసంలో చాలా మంది అయ్యప్ప మాలలు, శివ మాలలు ధరించిన స్వాములు పాదరక్షలు లేకుండా నడుస్తుంటారని చెప్పారు. బహిరంగంగా ఉమ్మటం వలన వారికి ఇబ్బంది కలుగుతుందని గుర్తించాలని కోరారు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించి, ఆరోగ్యకర సమాజానికి పాటుపడాలన్నారు. సంఘ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయడంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం ఎంత ప్రమాదకరమో, ఇది కూడా ప్రజల ఆరోగ్యపరంగా అంతే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో సభ్యులు సాయికార్తీక్, స్వరూప్, చైతన్య, సిరాజ్, భవానీ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, 15 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 21 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: లక్కీ భాస్కర్, అమరన్, బఘీర, సింగం అగైన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: భూల్ భులయ్యా-3, లక్కీ భాస్కర్, అమరన్, బఘీర

లక్ష్మి:	క
సత్యగౌరి:	లక్కీ భాస్కర్
తిరుమల:	బఘీర
సిఅండ్‌సీ1:	అమరన్
సీఅండ్‌సీ2:	క
శ్రీప్రియ:	లక్కీ భాస్కర్
పద్మప్రియ:	దేవర
సూర్య1(వాకలపూడి):	లక్కీ భాస్కర్

కొత్త ఓటర్లను చేర్చుకోవాలి

ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు కోరారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటర్ల సర్వే, నమోదు కార్యక్రమాలు డిసెంబర్‌తో ముగియనున్న నేపథ్యంలో కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం–6 ద్వారా 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చాలన్నారు. అలాగే ఓటర్ల లిస్టులో మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం ఉందన్నారు. మృతుల ఓట్లను ధ్రువీకరణ పత్రం ద్వారా తొలగించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ సమావేశంలో రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్ కల్యాణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి రైళ్ల రాకపోకలు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.08
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



బోట్‌క్లబ్‌లో పూజలు చేస్తున్న భక్తులు



గాటిలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



పేర్రాజుపేటలోని కనకదుర్గ ఆలయంలో కోనేరు వద్ద..



కాకినాడ రూరల్ తిమ్మాపురం శివారులో..



అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో నాగేంద్రస్వామి

బోట్‌క్లబ్: నగరంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలు, బహిరంగ ప్రదేశాల్లోని పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు, తేగముక్కలు, తాటిటెంక గుంజులు వేసి పూజలు చేశారు. తమకు ఎటువంటి అపాయం లేకుండా చూడాలని ప్రార్థించారు. స్థానిక సినిమా రోడ్డులో ఉన్న నాగేంద్రస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేసేందుకు భక్తులు క్యూలు కట్టారు. సుమారు రెండు గంటల సేపు భక్తులు క్యూలో నిలబడ్డారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన పుట్టలో పాలు పోసేందుకు భక్తులు క్యూ కట్టారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో పుట్టలో పాలు పోసేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. స్థానిక పేర్రాజుపేటలోని కనకదుర్గ ఆలయం ఎదురుగా ఉన్న కోనేరు వద్ద పుట్టలో పాలు పోసేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఎగబడ్డారు. స్థానిక రామారావుపేట శివాలయం, దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానంలోను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక టూటౌన్ బ్రిడ్జి కింద గాటిలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుట్ట వద్ద భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి పుట్టలో పాలు, తేగ ముక్కలు, టెంక గుంజు వేశారు. సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ సౌజన్యంతో వేళంగికి చెందిన శిల్పి కోదండరామ ఇక్కడ పుట్టను తయారుచేశారు. పుట్టలు వద్ద బాణసంచా కాల్చి చిన్నారులు సందడి చేశారు. నగర శివారు ప్రాంతాల్లోనూ పుట్టలు వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాలు పోయడం కనిపించింది.

అయ్యప్పస్వామి ఆలయంలో..

స్థానిక రిజర్వు పోలీస్ లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నాగేంద్రుడు, సుబ్రహ్మణేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సర్వారిష్ట నివారణకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాల కృష్ణ పాల్గొన్నారు.

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు నాగుల చవితి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిల్లలు, పెద్దలు పొలాలు, తోటల్లోకి వెళ్లి నాగుల పుట్టలో పాలు పోసి, కోడిగుడ్డు, తేగలు, చిమిలి నైవేద్యంగా సమర్పించారు. పాడి, పంటలు వృద్ధి చెందాలని రైతులు పూజించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వెలసిన పుట్ట వద్ద భక్తులు బారులు తీరారు. కరప, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, వేములవాడ, వేళంగి, నడకుదురు, పెనుగుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, కూరాడ, కొంగోడు, జెడ్.భావారం తదితర గ్రామాల్లోని మామిడి తోటలు భక్తులతో కిటకిటలాడాయి.

గ్రామ శివారుల్లో సందడి

కాకినాడ రూరల్: కార్తిక మాసంలో తొలి పండగ నాగుల చవితిని మండలంలో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామ శివారు ప్రాంతాలు, పొలాలలో భక్తుల సందడి నెలకొంది. పాము పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. గ్రామాలలో పాటు, కాకినాడ బోట్‌క్లబ్, ఆర్టీసీ కాలనీ శివాలయం వద్ద చవితి పూజలను భక్తులు నిర్వహించారు.